పెన్ పవర్
10 YEAR ANNIVERSARY 2014 - 2024
తెలంగాణ రౌండప్
గురువారం 26 డిసెంబర్ 2024 పేజీలు 8

## 20 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి లక్ష్యంతో ముందుకెళ్తున్నాం

- కొత్త క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ విధానాన్ని ప్రతిపాదించినట్లు వెల్లడి
- అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి అని వెల్లడి
- తెలంగాణలో విద్యుత్ డిమాండ్ క్రమంగా పెరుగుతుందన్న భట్టివిక్రమార్క

-3 లో



# మెదక్ జిల్లాలో.. ఉప రాష్ట్రపతి పర్యటన

## తునికి గ్రామ రైతులు సేంద్రియ సేద్యంతో చరిత్ర సృష్టించారని ప్రశంసించారు..



-2లో

- మెదక్ జిల్లాలోని ఈ గ్రామం తనకు మార్గదర్శకంగా నిలిచిందని కొనియాడారు..
- గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వికాసానికి, జై జవాన్, జై కిసాన్ నినాదంతో మహనీయులు ఎందరో..
- తునికి గ్రామ రైతులు తమకు ప్రత్యేక అతిధులని, వారికి మూడు రోజుల పాటు ఢిల్లీలో అతిధ్యం..
- భారత ఆర్థిక వ్యవస్థలో రైతుల భాగస్వామ్యం ఉంటేనే దేశం పురోభివృద్ధి చెందుతుందన్నారు..
- భారత ఉప రాష్ట్రపతి జాగదీప్ దన్‌కర్ బుధవారం మెదక్ జిల్లాలో పర్యటించారు..

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు



హైదరాబాద్ పెన్ పవర్: మెదక్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఇంచార్జి బిషప్ రైట్ రెవరెండ్ రూబెన్ మార్క్ దైవ వాక్యాన్ని అందించారు. వందేండ్ల మహా దేవాలయంలో ప్రతిష్ట మహెూత్సవం జరుపుకుంటున్నందుకు అందరం ధన్యులమని

-మిగతా 2లో

## మహిళా కానిస్టేబుల్, కంప్యూటర్ ఆపరేటర్ మృతి.. ఎస్సై అదృశ్యం

- అడ్లూరి ఎల్లారెడ్డి చెరువు వద్ద ఇద్దరి మృతదేహాలు లభ్యం
- ఆచూకీ తెలియని ఎస్సై.. అర్ధరాత్రి వరకు గాలింపు
- మృతి చెందిన కానిస్టేబుల్ శ్రుతి, కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్

-3లో

-మిగతా 2లో

## అల్లు అర్జున్ పంచాయతీలోకి బౌన్సర్లను ఎందుకు తెస్తున్నారు?

- బౌన్సర్లను పెట్టుకొని జనాలను నెట్టే కార్యక్రమాన్ని తెచ్చిందే రేవంత్ రెడ్డి అని విమర్శ
- సీవీ ఆనంద్‌కు చిత్తశుద్ధి ఉంటే బౌన్సర్ల వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు బౌన్సర్లను పెట్టుకున్నారన్న రఘునందన్ రావు



# మెదక్ జిల్లాలో.. ఉప రాష్ట్రపతి పర్యటన..







## సంక్షేమ పథకాలు రైతులకు అందించాలి..

భారత దేశంలో దాదాపు 10 కోట్ల మంది రైతులు ఉన్నారని, ప్రభుత్వం కల్పించే సంక్షేమ ఫలాలు అందడం లేదని, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు రైతులకు అందే విధంగా కె.వి.కె. వంటి సంస్థలు భాధ్యత తీసుకోవాలన్నారు.. ప్రభుత్వ విద్యుత్ సబ్సిడీలపై ఆధారపడకుండా సోలార్ విద్యుత్ వినియోగించుకునే విధంగా రైతులను చైతన్యపరచాలని సూచించారు..

భారత దేశ రైతులు సాగులో ప్రపంచంలోనే శ్రేష్టమైన రైతులుగా ఎదిగేందుకు కే.వి.కే, ఐకార్ లు కృషి చేయాలన్నారు..

## నూతన పద్ధతులపై రైతులను చైతన్య పరచడంలో విఫలం..

గ్రామీణ ప్రాంతాలలో తాము పండించిన పండ్లు, కూరగాయలను యూనిట్‌గా ఏర్పాటు చేసుకుని అక్కడే విక్రయించుకోవాలని ఉపరాష్ట్రపతి సూచించారు..అదే ప్రాంతంలోనే విక్రయించినట్లయితే ఆ ప్రాంత గ్రామీణ వ్యవస్థ అభివృద్ధి చెందుతుందన్నారు.. కృషి విన కేంద్రాల్లో వేలాది సంఖ్యలో శాస్త్రవేత్తలు, తగిన ఆర్థిక వ్యవస్థ ఉన్నప్పటికీ అనుకున్న రీతీలో రైతులను నూతన పద్ధతులను వినియోగించుకునే విధంగా చైతన్య పరచడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## త్వరలో వైభవంగా రజతోత్సవం వేడుకలు..

2001 సంవత్సరంలో అప్పటి ప్రధాని వాజ్‌పాయ్ నేతృత్వంలో కిసాన్ దివస్‌ను ప్రకటించారని, త్వరలో అత్యంత వైభవోపేతంగా రజతోత్సవం వేడుకలు నిర్వహించుకో బోతున్నారన్నారు.. భారతదేశంలోని 730 పై చిలుకు కృష్టి విన కేంద్రాలు, 150 ఐకార్ సంస్థలు, ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు సిద్ధమైనట్లు తెలిపారు.. భారత ఆర్థిక వ్యవస్థలో రైతుల భాగస్వామ్యం ఉంటేనే దేశం పురోభివృద్ధి చెందుతుందన్నారు. ఇంధన, సహజ వనరుల అవసరం మేరకే వినియోగించుకోవాలని సూచించారు..

**మెదక్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 25:**

మెదక్ జిల్లాలోని తునికి గ్రామంలోని 655 మంది రైతులు సేంద్రియ సేద్యం చేపట్టి దేశంలోనే చరిత్ర సృష్టించారని భారత ఉప రాష్ట్రపతి జాగదీప్ దన్‌కర్ ప్రశంసించారు.. బుధవారం మెదక్ జిల్లా తునికి గ్రామంలోని సేంద్రియ సేద్యం రైతులను కలిశారు.. ఈగ్రామ రైతులు సేంద్రియ సాగులో తక్కువ సమయంలో ఎక్కువ అభివృద్ధి, మార్పు సాధించారని ఆయన మెచ్చుకున్నారు.. గ్రామం చిన్నది కాదని, తనకు మార్గదర్శకంగా నిలిచిందని ఉపరాష్ట్రపతి ప్రశంసించారు.. సేంద్రియ సాగు రైతులందరూ మూడు రోజుల పాటు ఢిల్లీలో తన స్వగృహానికి అతిధులుగా రావాలని ఆహ్వానించారు.. తనకు ఈ 655 మంది సేంద్రియ రైతులు, తునికి గ్రామ రైతులు ప్రత్యేక అతిధులని, వారికి మూడు రోజుల పాటు ఢిల్లీలో అతిధ్యం ఇవ్వబోతున్నట్లు పేర్కొన్నారు.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వికాసానికి, జై జవాన్, జై కిసాన్ నినాదంతో లాల్ బహదుర్ శాస్త్రి, అటల్ జీ, జై జవాన్, జై కిసాన్, జై విన్, జై అనుసంధాన్ నినాదంతో ప్రధాని మోదీ కృషి చేశారన్నారు..

త్వరలో భారత్, జపాన్, జర్మనీ దేశాలను వెనక్కు నెట్టి ప్రపంచంలో మూడవ ఆర్థిక వ్యవస్థగా భారత్ అవిర్భవించ బోతుందన్నారు..

## విదేశీ మారక ద్రవ్యం కంటే 700 రెట్లు పెరిగింది..

గాందీజీ స్వాదేశి నినాద స్ఫూర్తితో "ఒకల్ ఫర్ లోకల్‌ను" ప్రధాని మోదీ పిలుపునిచ్చారన్నారు. 1989లో విదేశి మారకద్రవ్య నిధులతో పోల్చుకుం ఓటే ప్రస్తుతం 700 రెట్లు పెరిగిందన్నారు.. రైతులు ఆందోళనలో ఉన్నారని, వారితో చర్చించి వారి సమస్యలకు పరిష్కార మార్గం చూపాలని అధికారులకు సూచించారు.. భూ, వాయు, అంతరిక్ష, ఆకాశ మార్గాల్లో భారత్ దూసుకెళ్తున్న నేపథ్యంలో రైతులకు ప్రోత్సాహం లభించకపోవడం, భాదకరం అంటూ ఉపరాష్ట్రపతి జాగదీప్ దన్‌కర్ ఆవేదన వ్యక్తం చేశారు.. ప్రతి భారతీయుడు జాతీయవాదం పై విశ్వాసంతో ఉండాలని ఉప రాష్ట్రపతి పిలుపునిచ్చారు..

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- మొదటి పేజి తరువాయి

తెలిపారు. దివ్యమైన ఈ మహా దేవాలయంలో 1924 డిసెంబర్ 25న క్రిస్మస్ వేడుకలు జరిగాయని చెప్పారు. తాజాగా వందేండ్ల వేడుకలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో అందరం భాగస్వామ్యులు అయినందుకు ధన్యులమని అన్నారు.ఆసియా ఖండంలోని అతి పెద్దదైన రెండో చారిత్రాత్మక దేవాలయంలో క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని ఇంచార్జి బిషప్ రైట్ రెవరెండ్ రూబెన్ మార్క్ తెలిపారు. మన జీవితంలో ఇది ఒక ఒక మైలు రాయి అని పేర్కొన్నారు. జ్ఞానులు ఏసుక్రీస్తు అనుసరించిన మార్గాన్ని అనుసరించాలని సూచించారు. లోక రక్షకుడిగా నన్ను రక్షించడానికి ఏసు వచ్చాడు.. సమస్త మానవాళికి ఏసుప్రభువు ఆశీస్సులు ఉండాలని అన్నారు.' బెత్లెహెంలో దావీదు వంశంలో ఏసు జన్మించాడు. ఏసును కలిగిన బిడ్డలు నిస్వార్థంగా ఆలోచించాలి. స్వార్ధ లోకంలో ప్రతిది నాది అనే ఆలోచనతో ఉంటున్నారు. ప్రతి ఒక్కరు స్వార్ధమైన ప్రార్ధనలు చేయాలి. స్వార్ధం మరియమ్మలో లేదు. ప్రతి ఒక్కరూ నిస్వార్ధంగా ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరిస్తూ బతకాలి.' అని సూచించారు.

# అల్లు అర్జున్ పంచాయతీలోకి బౌన్సర్లను ఎందుకు తెస్తున్నారు?

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్న సమయంలో బౌన్సర్లను పెట్టుకొని జనాలను పక్కకు నెట్టే కార్యక్రమాన్ని తీసుకువచ్చారని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. అసలు అల్లు అర్జున్ పంచాయతీలోకి బౌన్సర్లను ఎందుకు తీసుకు వస్తున్నారని ప్రశ్నించారు. హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్‌కు చిత్తశుద్ధి ఉంటే బౌన్సర్ల వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు బౌన్సర్లను తీసుకువచ్చి జనాల్ని నెట్టే సంస్కృతిని పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి ప్రారంభించారని ఆరోపించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా బౌన్సర్లను పెట్టుకున్నారన్నారు.

## మహిళా కానిస్టేబుల్, కంప్యూటర్ ఆపరేటర్ మృతి.. ఎస్సై అదృశ్యం

హైదరాబాద్ పెన్ పవర్:కామారెడ్డి జిల్లా భిక్కనూరు ఎస్సై సాయికుమార్, బీబీపేట ఠాణాలో పనిచేస్తున్న కానిస్టేబుల్ శ్రుతి, బీబీపేట సహకార సంఘంలో ఆపరేటర్‌గా పనిచేస్తున్న నిఖిల్ అనే యువకుడు ఒకేసారి అదృశ్యమైన ఘటన జిల్లాలో కలకలం సృష్టించింది. సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు ఒడ్డున వారి వస్తువులు కనిపించడంతో పోలీసులు చెరువులో బుధవారం రాత్రి గాలింపు చేపట్టారు. అర్ధరాత్రి సమయానికి శ్రుతి, నిఖిల్ మృతదేహాలు చెరువులో లభ్యమయ్యాయి. జిల్లా ఎస్పీ సింధుశర్మ ఆధ్వర్యంలో పోలీసులు.. ఎస్సై ఆచూకీ కోసం గాలిస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే... భిక్కనూరు ఎస్సై సాయికుమార్ సెల్‌ఫోన్ బుధవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి స్విచ్‌ఆఫ్ రావడంతో పోలీసు అధికారులు ఆయన కోసం ఆరా తీయడం ఆరంభించారు. బీబీపేట ఠాణాలో పనిచేస్తున్న కానిస్టేబుల్ శ్రుతి బుధవారం ఉదయం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్నట్లు స్టేషన్లో చెప్పి బయటికి వచ్చారు.

**ఎస్సై సాయికుమార్**

మధ్యాహ్నమైనా కూతురు రాకపోవడంతో గాంధారి మండలం గుర్జాల్‌లో ఉంటున్న ఆమె తల్లిదండ్రులు బీబీపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్టేషన్ నుంచి ఎప్పుడో వెళ్లిపోయినట్లు వారు తెలపడంతో ఆందోళన చెందిన శ్రుతి తల్లిదండ్రులు వెంటనే అధికారులను సంప్రదించారు. ఆమె ఫోన్ సిగ్నల్ ఆధారంగా సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వద్ద ఉన్నట్లు గుర్తించారు. ఎస్పీ ఆధ్వర్యంలోని పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో చెరువు వద్ద కానిస్టేబుల్ శ్రుతి సెల్‌తోపాటు బీబీపేటకు చెందిన నిఖిల్ సెల్ కూడా దొరికింది. భిక్కనూరు ఎస్సై సాయికుమార్‌కు చెందిన కారు, పాదరక్షలు, నిఖిల్ పాదరక్షలూ కనిపించాయి. అనుమానంతో చెరువులో గాలించడంతో ఇద్దరి మృతదేహాలు బయటపడ్డాయి. ఎస్సై ఫోన్ స్విచ్‌ఆఫ్ అని వస్తుండడంతో ఏం జరిగి ఉంటుందన్నది అంతుచిక్కడం లేదు.

## 20 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి లక్ష్యంతో ముందుకెళ్తున్నాం

హైదరాబాద్ పెన్ పవర్:2030 నాటికి స్వచ్ఛమైన, స్థిరమైన 20 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు వెళుతుందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. హరిత ఇంధనానికి పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి, జాతీయస్థాయిలో పెట్టుకున్న లక్ష్యాన్ని అందుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం ఒక కొత్త క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ విధానాన్ని ప్రతిపాదించిందన్నారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి అన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో తెలంగాణ విద్యుత్ డిమాండ్ క్రమంగా పెరుగుతోందన్నారు. 2023-24లో 15,623 మెగావాట్లుగా ఉన్న విద్యుత్ డిమాండ్ 2027-28 నాటికి 20,968, 2034-35లో 31,809 మెగావాట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు.

# తిరుమల వైకుంఠ ద్వార దర్శనం.. తొమ్మిది ప్రాంతాల్లో టోకెన్లు



హైదరాబాద్ పెన్ పవర్:తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనానికి టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. జనవరి 10 నుంచి 19 వరకు వైకుంఠ ద్వార దర్శనానికి తిరుపతి నగరంలో 9 ప్రాంతాలలో వైకుంఠ ఏకాదశి దర్శనం టోకన్లు జారీకి కేంద్రాలు ఏర్పాటు చేసింది. క్యూలైన్లలో భక్తులు సహనం పాటించి తోపులాటకు ఆస్కారం లేకుండా టోకెన్లు పొందేవిధంగా చర్యలు తీసుకుంటోంది. అలాగే ప్రతిఒక్క భక్తుడు వైకుంఠ దర్శనం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేస్తోంది టీటీడీ. టికెట్లు కౌంటర్ల దగ్గర భారీ కేడింగ్ పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయనున్నారు పోలీసులు. 10 రోజుల పాటు జరగనున్న వైకుంఠ ద్వార దర్శనంపై డిసెంబర్ 24న పోలీస్ అధికారులు. టీటీడీ ఈవో శ్రీ.శ్యామలారావు, అడిషనల్ ఈవో శ్రీ.వెంకయ్య చౌదరి, జేఈవో శ్రీమతి. గౌతమి, జిల్లా కలెక్టర్ శ్రీ.వెంకటేశ్వర్, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీ.శ్రీధర్, జిల్లా ఎస్పీ శ్రీ ఎల్ సుబ్బరాయుడు భద్రతపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడిన జిల్లా ఎస్పి శ్రీ ఎల్ సుబ్బరాయుడు ప్రజల సౌకర్యార్థం నగరంలో 9 ప్రాంతాలలో టోకెన్ జారీ చేయు కేంద్రాలను టీటీడీ వారు ఏర్పాటు చేశారని అక్కడ రద్దీకి తగ్గట్టు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు, వైకుంఠఏకాదశి, ద్వాదశి పర్వదినాలతో పాటు 10 రోజుల పాటు తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వైకుంఠ ద్వార దర్శనం భక్తులకు చేసుకొనే విధంగా ఏర్పాట్లను టీటీడి చేసిందని, స్థానిక ప్రజలే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి అశేష భక్త జనం వచ్చే అవకాశం ఉన్నందున భద్రతాపరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నామని అన్నారు.

వైకుంఠ ఏకాదశి పర్వదినాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం వారు వైకుంఠ ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఏకాదశి ద్వాదశి రోజులతో పాటు మొత్తం 10 రోజులు శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం వుంటుంది కావున భారీగా భక్తులు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని టోకన్ల జారీ చేయు కేంద్రాలలోని క్యూలైన్లలో తోపులాటలు జరుగకుండా, అలాగే రద్దీని క్రమబద్ధీకరించడానికి తగినంత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఏకాదశి, ద్వాదశి రోజులే కాకుండా జనవరి 10 నుంచి జనవరి 19 వరకు మొత్తం 10 రోజుల పాటు వైకుంఠ ద్వారం దర్శనానికి టీటీడీ వారు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని.. భద్రతా పరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు,ప్రజలు కూడా అత్రుత పడకుండా సహనం వహించి తోపులాటకు అవకాశం ఇవ్వకుండా తిరుపతి నందు టోకెన్లు పొంది, ప్రశాంతమైన వాతావరణంలో వైకుంఠ ద్వార దర్శనం చేసుకుని టీటీడీ నియమ నిబంధనలు, సూచనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలన్నారు.

# ఆస్తులు పంచి అనాథగా మృతి చెందిన సత్తెమ్మ ..శవాన్ని ఇంట్లోకి తేనివ్వని బంధువులు



హైదరాబాద్ పెన్ పవర్:మాయమై పోతున్నదమ్మా.. మనిషన్నవాడు.. మచ్చుకైనా లేదు చూడు మానవత్వం ఉన్నవాడు అన్నాడు అందెశ్రీ. ఆ తన ఆస్తులను బంధువులకు పంచి.. అనాథగా పోయిందో అవ్వ. ఆస్తులు తీసుకున్న వారు ఆ ఇంట్లోకి శవాన్ని కూడా తేనివ్వలేదు..! ఇంటికి తాళం వేసుకొని భీష్మించారు. అంబులెన్స్ ఆరు గంటల పాటు ఇంటిముందు పడిగాపులు కాసింది. చివరకు పోలీసులు ఎంట్రీ ఇచ్చారు. ఇంటి తాళాలు పగులగొట్టి శవాన్ని తీసుకెళ్లారు. ప్రైవేటు వ్యక్తులతో అంత్యక్రియలు పూర్తి చేయించారు. పట్టణానికి చెందిన సాదుల సత్తెమ్మ (85) అనారోగ్యంతో నిన్న మృతి చెందింది. ఆమె భర్త లక్ష్మణ్ 20 ఏండ్ల క్రితం చనిపోయాడు. అప్పటి సంతానం లేకపోవడంతో ఒంటరిగానే ఉంటోందామె. అనారోగ్యం బారిన పడ్డ సత్తెమ్మ.. చివరి రోజుల్లో తనకు ఇంత గంజిపోస్తారనే ఆశతో తన ఆస్తులన్నింటినీ సమీప బంధువులకు ఇచ్చేసింది. చికిత్స పొందుతూ నిన్న కన్ను మూసింది. అంబులెన్సులో మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. సత్తెమ్మ నుంచి ఇంటిని

రాయించుకున్న బంధువులు అటువైపు చూడలేదు. ఆ ఇంటికి శవాన్ని తేనివ్వకపోగా తాళం వేసుకున్నారు. చుట్టు పక్కల వారు నచ్చజెప్పేందుకు యత్నించినా ఫలితం లేక పోయింది. ఆరు గంటల పాటు శవంతో అంబులెన్స్ ఆరు బయటే నిలుచుంది. చివరకు పోలీసులు ఎంట్రీ ఇచ్చారు. తాళం పగులగొట్టి ఇంట్లోకి సత్తెవ్వ మృతదేహాన్ని తీసుకెళ్లారు. ఆస్తులు తీసుకున్న వారు సహకరించలేదు. చివరకు ప్రైవేటు వ్యక్తులతో చితికి నిప్పు పెట్టించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ హృదయ విదారక దృశ్యాన్ని చూసిన పలువురు కన్నీరు పెట్టుకున్నారు.

# ఆధ్యాత్మికం: గుళ్లో ప్రదక్షిణం ఎందుకు చేయాలి.. తీర్థయాత్రల వల్ల ఉపయోగం ఏమిటి,,రావి చెట్టూ తిరిగితే పిల్లలు పుడతారా..?

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆచారాలు, సంప్రదాయాలు ఒకతరం నుంచి మరో తరానికి వస్తూ ఉంటాయి. అవి ఎప్పుడు పుట్టాయో, ఎందుకు పుట్టాయో. ఎవరు పుట్టించారో కూడా కచ్చితంగా చెప్పలేరు. కానీ పెద్దల మాట చద్దిమూట అని ఆచరిస్తూ ఉంటారు. ఆ ఆచారాల వెనక ఈ తరానికి తెలియని ఎన్నో మంచి విషయాలు ఉన్నాయి. తెలియకుండా పాటించడం కంటే వాటిలోని మంచి గురించి కూడా తెలుసుకోవాలి. అందుకే... కొన్ని ఆచారాల వల్ల జరిగే మేలు గురించి తెలుసుకుందాం...

దేవాలయానికి వెళ్లగానే ప్రదక్షిణ చేస్తారు. గర్భ గుడి చుట్టూ తిరుగుతారు. మరికొందరు ఎవరికి వాళ్లే గుండ్రంగా ప్రదక్షిణం చేస్తారు. ఈ రెండు రకాలైన ప్రదక్షిణల వల్ల లాభాలున్నాయి. మనిషి సత్వ, రజో, తమో గుణాల కలయిక. ఈ మూడు గుణాలకు అతీతంగా ఉన్నప్పుడే దైవానికి దగ్గర కాగలడు. ప్రదక్షిణ వల్ల ఇది సాధ్యమవుతుందని పురాణాలు చెప్తాయి. కానీ మనిషి తనకు తాను గుండ్రంగా తిరగడం వల్ల నిటారుగా నిలబడే శక్తి పొందుతాడు. అలాగే దేవాలయంలోని శక్తికి కేంద్రమైన గర్భగుడి చుట్టూ తిరగడం వల్ల మనిషి ఆ శక్తిని కొంతవరకు గ్రహించగలుగుతాడని అంటారు.

మనం నివసించే భూమి భక్తుడికి ప్రతీక. భూమి కూడా తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుడి చుట్టూ తిరుగుతుంది. అంటే భ్రమణం, పరిభ్రమణం వల్ల తన శక్తితో పాటు, సూర్యుని నుంచి కూడా శక్తిని గ్రహిస్తుంది. ఇదో వైజ్ఞానిక సూత్రం, ప్రదక్షిణ వల్ల మనిషి కూడా ఇలాంటి శక్తిని పొందే అవకాశం ఉన్నదని మరికొందరు చెప్తారు. అలాగే ప్రదక్షిణ ఎప్పుడూ సవ్య దిశలోనే ఉంటుంది. కుడి దిశలో తిరగడం వల్ల మనిషికి పాజిటివ్ ఎనర్జీ లభిస్తుంది.

సూర్యోదయానికి ముందే నిద్ర లేవడం

పెద్దలు రోజూ అయిదు గంటలకే నిద్రలేవాలని చెప్తారు. తెల్లవారు జామున వీచే గాలి ఆరోగ్యానికి చాలా మంచిది. ఆ గాలిలో అమృతరసం ఉంటుందని అంటారు. దీనినే హీరవాయువు కూడా అని పిలుస్తారు. దీని వల్ల బుద్ధి వికసిస్తుంది. ఆయుష్ష పెరుగుతుంది. అందుకే పిల్లలను వేకువజామున లేచి చదువుకోమని చెప్తారు. ఆ వేళలో చదివితే మనసుకు ఎక్కుతుంది. ..మర్చి పోరు.



### తీర్థయాత్రలు

తీర్థయాత్రలు చేయడం వల్ల పిల్లలు పుడతారని చెప్తుంటారు. పురాణాలు, కథల్లోనూ ఈ విషయం కనిపిస్తుంది. తీర్థయాత్రలు చేయడం వల్ల వాతావరణం మారుతుంది. దాంతో శరీరంలో మార్పులు వస్తాయి.. నదుల్లో నీళ్లు ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉంటాయి. వాటిల్లో స్నానం చేయడం వల్ల అనా రోగ్య సమస్యలు తగ్గి, గర్భధారణకు అవకాశం కలగొచ్చు.

### పిల్లలకు చెవులు కుట్టించడం

చిన్నవయసులోనే అమ్మాయిలకు చెవులు కుట్టిస్తారు. ఒకప్పుడు అబ్బాయిలకు కూడా చెవులు కుట్టించి రింగులు పెట్టే ఆచారం ఉండేది. చెవులు కుట్టించడం ఆక్యుప్రెషర్ వైద్యం లాంటిదే. దీనివల్ల కొన్ని రకాల అనారోగ్యాలు దరిచేరవు. ముఖ్యంగా ఆస్తమా లాంటి వాటి నుంచి ఇదికాపాడుతుందని చెప్తారు.

### నేలపై కూర్చొని భోజనం చేయడం

ఇప్పుడైతే చాలామంది డైనింగ్ టేబుల్ దగ్గర కుర్చీలపై కూర్చొని తింటున్నారు. ఒకప్పుడు పీటమీద కూర్చొని తినేవాళ్లు లేదా నేల మీద కూర్చొని భోజనం చేసేవాళ్లు. అలాంటప్పుడు శరీరం పద్మాసనం భంగిమలో ఉంటుంది. దీనివల్ల జీర్ణక్రియ సాఫీగా జరుగుతుంది. జీర్ణకోశ సంబంధ సమస్యలు చాలా వరకు రావు..

### బొట్టుపెట్టుకోవడం

స్త్రీలు బొట్టు పెట్టుకోవడం హిందూ సంప్రదాయంలో కనిపిస్తుంది. కొందరు మగవాళ్లు కూడా నుదుట బొట్టు పెట్టుకుంటారు. దీనిలో ఆరోగ్య రహస్యం ఉంది. నరాలు సరిగా పనిచేస్తాయి. అందువల్ల ఒత్తిడి, బీపీ, ఆందోళన వంటివి తగ్గుతాయి.

### ఉపవాసం

అప్పుడప్పుడు ఉపవాసం ఉండటం మంచిదేనని వైద్యులు కూడా చెప్తున్నారు. ఎందుకంటే, ఉపవాసం రోజున శరీరంలోని జీర్ణవ్యవస్థ పని చేయాల్సిన అవసరం ఉండదు. అదనంగా ఉన్న కొవ్వు తగ్గుతుంది. చెడు పదార్థాలు బయటకు వెళ్తాయి. దాంతో కొన్ని రకాల ఇన్ఫెక్షన్లు రావు..

### నదులు, కోనేరుల్లో నాణేలు వేయడం

నదుల్లో, కోనేరులో స్నానం చేసేముందు నాణేలు వేస్తారు. ఒకప్పుడు నాణేలు రాగితో తయారు చేసేవాళ్లు. రాగికి నీటిని శుద్ధిచేసే శక్తి ఉంది. వాటిలో ఎక్కువమంది స్నానాలు చేస్తారు కాబట్టి నీళ్లు పరిశుభ్రంగా ఉండటానికి ఇవి వేయడమే మంచిది.

### రావి చెట్టును పూజించడం

పిల్లలు పుట్టని వాళ్లకు రావిచెట్టును పూజించమని, దాని చుట్టూ ప్రదక్షిణ చేయమని చెప్తారు. దీని వెనక కూడా ఆరోగ్య సూత్రం ఉంది. రావి ఆకులకు ఆక్సిజన్ ఎక్కువగా ప్రసారం చేసే శక్తి ఉంటుంది. వాటిలో ఉన్న విద్యుత్ అయ స్కాంత శక్తి శరీరంలోకి ప్రవేశిస్తుంది. అందువల్ల స్త్రీల శరీరంలో మార్పులు జరిగి సంతానోత్పత్తికి అవకాశం కలగొచ్చు..

### ఉత్తరం దిక్కుకు తలపెట్టి పడుకోకూడదు

నిద్రపోయేటప్పుడు ఉత్తరం దిక్కుకు తలపెట్టొద్దని పెద్దలు చెప్తారు. ఎందుకంటే, శరీరానికి కూడా అయస్కాంత శక్తి ఉంటుంది. ఉత్తర దిక్కుకు తల పెడితే శరీరంలోని ఐరన్ మెదడుకు చేరే అవకాశాలు ఎక్కువ. దాంతో గుండె సంబంధమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అంతేకాదు తలనొప్పి, అల్జీమర్స్ లాంటివి కూడా రావచ్చు. కాబట్టే ఉత్తరం దిక్కుకు తలపెట్టి నిద్ర పోవవద్దని పెద్దలు చెప్తారు.

# అమ్మా.. నిర్మలమ్మా:మీరు మీ పాత కారు అమ్ముతున్నారా..18 శాతం GST కట్టండి?

**హైదరాబాద్ పెన్ పవర్:**మీరు ఏదైనా వస్తువు కొన్నారా.. కొంటే కచ్చితంగా జీఎస్టీ కట్టాలి. ఇంట్లో తినే ఉప్పు, పప్పు నుంచి అగ్గిపెట్టె వరకు అన్నింటికీ జీఎస్టీ కడుతున్నారు.. ఇక నుంచి కొంటేనే కాదు.. అమ్మినా కూడా జీఎస్టీ కట్టాలి. అవును.. మీరు మీ పాత కారు అమ్మాలనుకుంటున్నారా.. డోంట్ వర్రీ.. హాయిగా అమ్ముకోండి.. కాకపోతే.. పాతవి అమ్మితే వచ్చి డబ్బులపై జీఎస్టీ కట్టండి..మీరు మీ పాత కారును లక్ష రూపాయలకు అమ్మారు అనుకుంటే..18 వేల రూపాయలు జీఎస్టీ పన్ను కట్టాలి అంట..ఇప్పుడు ఇదే దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యింది. ఈ పూర్తి వివరాలు తెలుసుకుందామా..

ఇటీవల జరిగిన 55వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎలక్ట్రిక్ వాహనాలతో సహా అన్ని రకాల వెహికల్స్ అమ్మినా కూడా జీఎస్టీ చెల్లించాలి. దేశవ్యాప్తంగా యూజ్డ్ కార్ల మార్కెట్ బాగా నడుస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు ఫైనాన్స్ మినిస్టర్ నిర్మలమ్మ. వేగంగా విస్తరిస్తున్న ఈ పాత కార్ల బిజినెస్ లో చాలా మంది పెట్టుబడులు పెడుతున్నారని.. ప్రభుత్వం ఆదాయం పెంచుకునే క్రమంలో పాత కార్ల అమ్మకంపై జీఎస్టీ వేస్తున్నారని తెలుస్తోంది.

### జీఎస్టీ ఎలా లెక్కిస్తారు?

పాత వెహికల్స్ కొనుగోలు ధర, అమ్మిన ధరను బట్టి జీఎస్టీ నిర్ణయించనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. కొనుగోలు, అమ్మకం రేట్ల మధ్య ఉన్న మార్జిన్ ఆధారంగా జీఎస్టీ నిర్ణయిస్తామని చెప్పింది. ఉదాహరణకు 12లక్షలకు ఓ కారు ను కొన్నట్లయితే.. దానిని 9లక్షలకు అమ్మితే వాటి మధ్య ఉన్న మార్జిన్ పై 18 శాతం జీఎస్టీ ఉంటుందని అన్నారు. అయితే మార్జిన్ ఎలా నిర్ణయించబడుతుందనే దానిపై వివరణ ప్రశ్నలను లేవనెత్తింది. GST పెరుగుదల అంతిమంగా అమ్మకందారులకు నష్టాలకు దారితీస్తుందా అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జాతీయ సమాచార, టెక్నాలజీ డిపార్టుమెంట్ ఇన్ ఛార్జ్ అమిత్ మాల్వియా పాత కార్ల అమ్మకంపై జీఎస్టీ నిర్ణయం పై ఇచ్చిన వివరణ ప్రకారం.. 18శాతంGST అనేది వాహనంపై అమ్మిన ధర, కొనుగోలు ధర మధ్య వ్యత్యాసంపై డీలర్లు సంపాదించిన మార్జిన్‌పై మాత్రమే లెక్కించబడుతుంది..అయితే వాహనం మొత్తం విలువపై కాదు అని చెప్పారు. ఈ విధానంలో పన్ను డీలర్ నిర్ణయించిన మార్జిన్ పైనే జీఎస్టీ నిర్ధారణ ఉంటుంది. ఇది GST ఫ్రేమ్‌వర్క్ కింద ఒక సర్వీస్ గా పరిగణించబడుతుంది.

### ఎందుకు వచ్చిందీ ఆలోచన..

దేశవ్యాప్తంగా యూజ్డ్ కార్ల మార్కెట్ వేగంగా వృద్ధి చెందుతోంది.ఇండియన్ బ్లూ బుక్ 2023 ప్రకారం.. భారత్ లో ఒక్క 2022-23 లోనే 31.33 బిలియన్ల డాలర్ల విలువైన కార్ల అమ్మకాలు జరిగాయి. 2027-28 నాటికి 70.48 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనావేస్తున్నారు.




FY2017 నుంచి FY2022 మధ్య 6శాతం ఉన్న యూజ్డ్ కార్ల మార్కెట్ సగటు వృద్ధి రేటు FY2023నుంచి FY2028 మధ్య 16శాతానికి పెరగవచ్చని రిపోర్టులు చెబుతున్నాయి. అదే కొత్త కార్ మార్కెట్ ఇదే కాలంలో 1శాతం నుండి 6శాతం వరకు చాలా నెమ్మదిగా వృద్ధి చెందుతుందని అంచనా వేస్తున్నారు. మధ్యతరగతి ప్రజల్లో పెరుగుతున్న యూజ్డ్ కార్ల అమ్మకంలో ఆదాయం, వ్యక్తిగత కార్ల వినియోగం లో పెరుగుతున్న డిమాండ్ కారణంగా యూజ్డ్ కార్ల మార్కెట్ వేగవంతమైన విస్తరణకు దోహదం చేస్తున్నాయి.జీఎస్టీ నిర్ణయం.. యూజ్డ్ కార్ల వ్యాపారంపై ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. ముఖ్యంగా కొనుగోలు చేసిన వెహికల్స్ పై డీలర్లు చేసే తరుగుదల క్లెయిమ్ పై ప్రభావం చూపనుంది. ప్రైవేట్‌గా వెహికల్స్ కొనుగోలు చేసే వ్యక్తి లేదా విక్రయించే వ్యక్తులపై పన్ను ప్రభావం ఉండదని చెబుతున్నారు.

# నా సినీ ప్రయాణంలో గొప్ప మైలురాయి.. మోహన్ బాబు భావోద్వేగ ట్వీట్!


- కుటుంబ గొడవల కారణంగా ఇటీవల వార్తల్లో నిలుస్తున్న మోహన్ బాబు
- తాజాగా 'అసెంబ్లీ రౌడీ' మూవీని ప్రస్తావిస్తూ ఎమోషనల్ ట్వీట్
- ఈ సినిమా తన తన కెరీర్‌లోనే ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించిందని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:**గత కొన్నిరోజులుగా కుటుంబ గోడవల కారణంగా సీనియర్ నటుడు మోహన్ బాబు వార్తల్లో నిలుస్తున్న సంగతి తెలిసిందే. ఇక సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఆయన తాజాగా ఓ ఎమోషనల్ ట్వీట్ చేశారు. 1991లో వచ్చిన తన సినిమా 'అసెంబ్లీ రౌడీ'ని ప్రస్తావిస్తూ ఆయన ఈ ట్వీట్ చేశారు. "1991లో విడుదలైన అసెంబ్లీ రౌడీ నా సినీ ప్రయాణంలో ఒక గొప్ప మైలురాయి. బి. గోపాల్ దర్శకత్వంలో వచ్చిన ఈ యాక్షన్, కామెడీ డ్రామాలో పవర్‌ఫుల్ పాత్ర పోషించాను. ఆకట్టుకునే కథాంశం ఈ చిత్రం సొంతం. పి.వాసు, పరుచూరి బ్రదర్స్ అందించిన ఇంపాక్ట్‌ఫుల్ డైలాగ్స్‌తో ఈ సినిమా నా కెరీర్‌లో ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించింది. థియేటర్లలో 200 రోజులు ఆడి, రికార్డుల మోత మోగించింది. నాకు కలెక్షన్ కింగ్ అనే టైటిల్‌ను అందించిన సినిమా కూడా ఇదే. ఈ చిత్రానికి కేవీ మహదేవన్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ఆయన అందించిన టైమ్‌లెస్ మ్యూజికల్ హిట్‌లు నేటికీ ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి" అంటూ తన ట్వీట్‌లో మోహన్ బాబు రాసుకొచ్చారు. దీనికి మూవీలో ఓ అద్భుతమైన సన్నివేశం తాలూకు వీడియోను కూడా జత చేశారు.

# సహారా బాధితులకు డబ్బులు పడేది ఎప్పుడో చెప్పిన కేంద్ర ప్రభుత్వం..

**హైదరాబాద్ పెన్ పవర్:**సహారా ఇండియా.. ఈ పేరు చెప్పగానే ఎన్నో కన్నీళ్ల కథలు .. ఎంతో మంది కష్టాల గాథలు గుర్తుకు వస్తాయి. రెక్కాడితే గానీ డొక్కాడని బడుగు జీవులు కొందరు.. మధ్య తరగతి ఆశాజీవులు కొందరు.. ఇలా అన్ని వర్గాల ప్రజలు తమ భవిష్యత్తుకు భరోసా ఇస్తుందని సహారాలో పెట్టుబడి పెట్టారు. కాయాకష్టం చేసి సంపాదించిన డబ్బులను తమ పిల్లల కోసమో.. లేదా భవిష్యత్తు కోసమో దాచుకున్న డబ్బులను కొల్లగొట్టి బోర్డు తిప్పేయడంతో ఎంతో మంది రోడ్డున పడ్డారు. లాభం లేకపోయినా సరే.. తమ కష్టార్జితం ఎప్పుడు చేతికి వస్తుందా అని వేయి కళ్లతో వేచిచూస్తున్న సహారా బాధితులకు ఇప్పుడొక శుభవార్త. సహారా బాధితులకు డబ్బులు ఇస్తామని, దానికి సంబంధించిన వివరాలు వెల్లడించింది ప్రభుత్వం.




సహారా బాధితులకు రీఫండ్ చేసేందుకు 2023, జులై 18న సహారా రీఫండ్ పోర్టల్ లాంచ్ చేసి ఏడాది దాటినా కూడా ఇప్పటికి డబ్బులు బాధితులకు అందలేదు. సహారా బాధితులకు డబ్బు తిరిగి ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రీఫండ్ పోర్టల్ ఏర్పాటు అయ్యింది. కానీ బాధితులు మాత్రం తమ పెట్టుబడి ఎప్పుడు తిరిగి ఇస్తారా అని ఎదురు చూస్తూనే ఉన్నారు.

ఈ అశంపై లోక్ సభలో ఎంపీ సునీల్ కుమార్ సహారా బాధితులకు డబ్బులు ఎప్పుడు తిరిగి ఇస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కోట్లాది ప్రజల డబ్బులు సహారా ఫైనాన్స్ లో ఇరుక్కుపోయాయని, ప్రభుత్వం పోర్టల్ ఏర్పాటు చేసినప్పటికీ ఎందుకు ఇంకా బాధితుల అకౌంట్లో డిపాజిట్ కావట్లేదని ప్రశ్నించారు. అదే విధంగా ఇప్పటి వరకు ఎంత మంది అకౌంట్లో డబ్బులు పడ్డాయి, వారి వివరాలేమిటి అని అడిగారు. ప్రభుత్వానికి లేదా సెబీకి రీఫండ్ విషయంలో ఏమైనా కార్యాచరణ ఉంటే చెప్పాలని డిమాండ్ చేశారు.

దీనిపై కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి వివరణ ఇచ్చారు. సుప్రీంకోర్టు 2012, ఆగస్టు 31న సహారా రియల్ ఎస్టేట్ కార్పోరేషన్ (SIRECL), సహారా హౌజింగ్ ఇన్వెస్ట్ మెంట్ కార్పోరేషన్ అదే విధంగా సంస్థ ప్రమోటర్లు, డైరెక్టర్లను రూ.25,781.37 కోట్లను సెబీ లో డిపాజిట్ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. 31 మార్చి 2024 నాటికి సెబీకి రూ.15,775.50 కోట్లు డిపాజిట్ అయ్యాయని తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రీఫండ్ కోసం బాండ్ హోల్డర్స్ ను అప్లై చేసుకోవాలని సెబీ ప్రకటించింది. అప్లై చేసుకున్న వారిలో 17,536 మంది దరఖాస్తులు పరిశీలించి రూ.138.07 కోట్ల రీఫండ్ చేసినట్లు మంత్రి తెలిపారు. మిగతా రీఫండ్ విషయంలో సెబీ అన్ని రకాల విచారణలు చేస్తోందని, బాధితులకు రీఫండ్ అందుతుందని అన్నారు. మిగతా రీఫండ్ ను 9 నెలలో బాధితులకు చెల్లించాలని సుప్రీం కోర్టు సెబీని ఆదేశించింది. వర్సోవా, ముంబయిలో ఉన్న భూములను అభివృద్ధి చేసేందుకు అగ్రిమెంట్ చేసుకున్న కంపెనీలకు రూ.వెయ్యి కోట్లు డిపాజిట్ చేసి అగ్రిమెంట్ చేసుకోవాలని అనుమతించినట్లు తెలిపారు.

## సంధ్య థియేటర్ ఘటన.. తప్పుడు పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవంటూ పోలీసుల వార్నింగ్

- ప్రజలను అపోహలకు గురి చేసేలా పోస్టులు పెడుతున్నారన్న పోలీసులు
- అల్లు అర్జున్ రాకముందే తొక్కసలాట జరిగిందని పోస్టులు పెట్టారని ఆగ్రహం
- పోలీసు శాఖను బద్నాం చేసేలా పోస్టులు పెడితే చర్యలు తప్పవని హెచ్చరిక





**హైదరాబాద్ పెన్ పవర్:** సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై సోషల్ మీడియాలో ప్రజలను అపోహలకు గురి చేసేలా ఎవరైనా తప్పుడు సమాచారాన్ని పోస్ట్ చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ పోలీసులు హెచ్చరించారు. థియేటర్ వద్దకు అల్లు అర్జున్ రాకముందే తొక్కిసలాట జరిగినట్టు కొందరు తప్పుడు పోస్టులు పెట్టిన అంశం తమ దృష్టికి వచ్చిందని పోలీసులు తెలిపారు. పోలీసు శాఖను బద్నాం చేసేలా తప్పుడు పోస్టుల పెడితే చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. తొక్కిసలాట ఘటనకు సంబంధించి ఎవరి దగ్గరైనా ఆధారాలు, అదనపు సమాచారం ఉంటే తమకు అందించవచ్చని తెలిపారు.

## మార్చి 29 వరకు అల్లు అర్జున్ జాతకం ఇలాగే ఉంటుంది: వేణు స్వామి

కిమ్స్ ఆసుపత్రిలో శ్రీతేజ్ ను పరామర్శించిన వేణు స్వామి

శ్రీతేజ్ తండ్రికి రూ. 2 లక్షల చెక్కును అందించిన వైనం

అల్లు అర్జున్ జాతకంలో శని ఉందని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:** సంధ్య థియేటర్ ఘటనలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్ ను జ్యోతిష్యుడు వేణు స్వామి పరామర్శించారు. అనంతరం శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి గురించి అతని తండ్రి భాస్కర్ ను అడిగి తెలుసుకున్నారు. భాస్కర్ కు రూ. 2 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా వేణు స్వామి మాట్లాడుతూ... శ్రీతేజ్ ఆరోగ్యం కోసం వారం రోజుల్లో మృత్యుంజయ హోమాన్ని తన సొంత ఖర్చులతో నిర్వహిస్తానని చెప్పారు. ప్రస్తుతం హీరో అల్లు అర్జున్ జాతకంలో శని ఉందని... అందుకే ఈ సంఘటన చోటుచేసుకుందని అన్నారు. వచ్చే ఏడాది మార్చ్ వరకు అల్లు అర్జున్ జాతకం ఇలాగే ఉంటుందని చెప్పారు. ఆయన కొంచెం జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరి జీవితంలో తప్పొప్పులు ఉంటాయని... ఏవరూ ఏదీ కావాలని చేయరని అన్నారు.

# అత్యధిక వేతనం.. అతి తక్కువ ఒత్తిడి.. 2025లో టాప్-10 ఉద్యోగాలు ఇవే!

- కొత్త ఏడాదిలో కొత్తగా ప్లాన్ చేసుకునే వారికి అనేక ఉద్యోగాలు
- బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్ డిగ్రీతో లక్షల్లో వేతనం
- ఉద్యోగాల జాబితాను విడుదల చేసిన 'రెజ్యుమె జీనియస్'



**హైదరాబాద్ పెన్ పవర్:**కొత్త ఏడాదికి హాయ్ చెప్పే క్షణాలు సమీపిస్తున్నాయి. నూతన సంవత్సరాన్ని కొత్తగా ప్రారంభించాలని, ఉద్యోగం-జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకోవాలని అనుకునేవారు ఎందరో. అలాంటి వారందరూ ఆర్థిక భద్రతతోపాటు మానసిక ఒత్తిళ్లు లేని ఉద్యోగాల కోసం వెతుకులాట మొదలుపెట్టారు. చాలామంది ఇప్పటికే ఆ పనిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి ఉద్యోగాల జాబితాను రెజ్యుమె బిల్డర్ సంస్థ 'రెజ్యుమె జీనియస్' ఈ నెల 16న రిలీజ్ చేసింది. అత్యధిక వేతనం ఇవ్వడంతోపాటు తక్కువ ఒత్తిడి ఉండే ఆ ఉద్యోగాలు ఏవో చూసేద్దామా?

### వాటర్ సోర్స్ స్పెషలిస్ట్

ఈ ఉద్యోగం ప్రారంభ వేతనం ఏడాదికి దాదాపు రూ. 1.3 కోట్లు. 2023లో 1,00,100 ఉద్యోగాలు ఉండగా వచ్చే పదేళ్లలో 8 శాతం పెరుగుతాయని అంచనా. బ్యాచిలర్ డిగ్రీ ఉంటే సరిపోతుంది. రీజినల్, మున్సిపల్ వాటర్ సరఫరాను నిత్యం పర్యవేక్షిస్తూ శుభ్రంగా, స్థిరంగా నిర్వహించాల్సి ఉంటుంది.

### ఖగోళ శాస్త్రవేత్తలు

ఖగోళ శాస్త్రవేత్తలకు మధ్యస్థంగా ఏడాదికి రూ. 1.2 కోట్ల వరకు వేతనం లభిస్తుంది. 2023లో 23,500 ఉద్యోగాలు ఉండగా వచ్చే పదేళ్లలో ఏడు శాతం పెరుగుతాయని అంచనా. డాక్టోరల్, లేదంటే ప్రొఫెషనల్ డిగ్రీ అర్హతతో ఈ ఉద్యోగం సంపాదించవచ్చు. నక్షత్రాలు, గ్రహాలు, అంతరిక్షానికి సంబంధించిన ఇతర పరిశోధనలు చేయాల్సి ఉంటుంది. ప్రధానంగా వీరి ఉద్యోగం పరిశోధనే.

### యాక్చురీస్ (బీమా గణికులు)

వీరికి ఏడాదికి కోటి రూపాయల వరకు వేతనం ఉంటుంది. గతేడాది 30,200 ఉన్న ఈ ఉద్యోగాలు వచ్చే దశాబ్ద కాలంలో 22 శాతం పెరిగే అవకాశం ఉంది. బ్యాచిలర్ డిగ్రీతో ఈ ఉద్యోగాన్ని సంపాదించుకోవచ్చు. యాక్చురీలు గణితం, గణాంకాలు, ఇతర ఆర్థిక డేటాను ఉపయోగించి ఆర్థిక నష్టాలను విశ్లేషిస్తారు.

### పర్యావరణ ఆర్థికవేత్తలు

వీరికి ఏడాదికి దాదాపు రూ. 98 లక్షల వరకు వేతనం చెల్లిస్తారు. నిరుడు 17,500 ఉన్న ఈ ఉద్యోగాలు వచ్చే పదేళ్ల కాలంలో ఐదు శాతం పెరుగుతాయని అంచనా. మాస్టర్స్ డిగ్రీ ఈ ఉద్యోగానికి అర్హత. పర్యావరణ ఆర్థికవేత్తలు సాధారణంగా ప్రభుత్వం, ఇతర సంస్థలతో కలిసి పనిచేస్తారు. ప్రాజెక్టుల ఖర్చులు, ప్రయోజనాలను వీరు అంచనా వేస్తారు.

### గణిత శాస్త్రవేత్తలు

గణిత శాస్త్రవేత్తలకు ఏడాదికి రూ. 89 లక్షల వరకు జీతం లభిస్తుంది. గతేడాది 34,800 జాబ్స్ ఉన్నాయి. వచ్చే దశాబ్దకాలంలో 11 శాతం పెరిగే అవకాశం ఉంది. మాస్టర్స్ డిగ్రీ కలిగిన వారు ఈ ఉద్యోగానికి అర్హులు.

### కంప్యూటర్ సిస్టం అనలిస్టులు

కంప్యూటర్ సిస్టం అనలిస్టులకు ఏడాదికి కనీసం రూ. 88 లక్షల వేతనం లభిస్తుంది. 2023లో 5.27 లక్షల ఉద్యోగాలు ఉన్నాయి. వచ్చే పదేళ్లలో ఇవి 11 శాతం పెరిగే అవకాశం ఉంది. బ్యాచిలర్ డిగ్రీ ఉంటే ఈ ఉద్యోగం సంపాదించుకోవచ్చు. వ్యాపారులు ఎక్కువగా సాంకేతికను ఉపయోగించుకునేలా చేయడమే వీరి లక్ష్యం. అందుకు అనుగుణంగా వీరు సహాయసహకారాలు అందిస్తారు. అందుకు తగ్గట్టుగా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తారు.

### ఫ్యూయల్ సెల్ ఇంజినీర్స్

వీరి వార్షిక వేతన దాదాపు రూ. 84 లక్షలు. గతేడాది 2.91 లక్షల ఉద్యోగాలు ఉండగా వచ్చే పదేళ్లలో 11 శాతం వృద్ధి కనిపించే అవకాశం ఉంది. బ్యాచిలర్ డిగ్రీ కలిగిన వారు ఈ ఉద్యోగానికి అర్హులు. వాహనాలు, భవనాలు క్లీన్ ఎనర్జీని ఉత్పత్తి చేసే సిస్టంను ఫ్యూయల్ సెల్ ఇంజినీర్లు డిజైన్ చేసి, అభివృద్ధి చేస్తారు.

### రిమోట్ సెన్సింగ్ సైంటిస్టులు, టెక్నాలజిస్టులు

వీరి వార్షిక వేతనం రూ. 79 లక్షల వరకు ఉంటుంది. 2023లో 26 వేల ఉద్యోగాలు ఉన్నాయి. వచ్చే పదేళ్లలో ఐదుశాతం పెరిగే అవకాశం ఉంది. గరిష్ఠంగా బ్యాచిలర్ డిగ్రీ చదువుకుని ఉంటే సరిపోతుంది. రిమోట్ సెన్సింగ్ సైంటిస్టులు, టెక్నాలజిస్టులు శాటిలైట్ డేటాను విశ్లేషించి క్లైమేట్ చేంజ్, అర్బన్ ప్లానింగ్ వంటి సమస్యలపై పనిచేయాల్సి ఉంటుంది.

### భౌగోళిక శాస్త్రవేత్తలు

భౌగోళిక శాస్త్రవేత్తల వార్షిక వేతనం రూ. 77 లక్షల వరకు వార్షిక వేతనం ఉంటుంది. గతేడాది 1600 ఉద్యోగాలు మాత్రమే ఉండగా వచ్చే దశాబ్ద కాలంలో మూడు శాతం ఉద్యోగాలు పెరిగే అవకాశం ఉంది. ఈ ఉద్యోగానికి కూడా బ్యాచిలర్ డిగ్రీ ఉంటే సరిపోతుంది. వీరు చేయాల్సిందల్లా భూమి, దాని లక్షణాలు, దాని విస్తరణ, లక్షణాలు, నివాసితులు వంటివాటిని అధ్యయనం చేస్తారు. అర్బన్ ప్లానింగ్, విపత్తు నిర్వహణ వంటి వాటిని మెరుగుపరచడానికి పనిచేస్తారు.

### ట్రాన్స్‌పోర్టేషన్ ప్లానర్స్

వీరికి ఏడాది రూ. 69 లక్షల వేతనం లభిస్తుంది. గతేడాది 2023 ఉద్యోగాలు ఉండగా వచ్చే పదేళ్లలో నాలుగు శాతం పెరిగే అవకాశం ఉంది. ఈ ఉద్యోగం పొందాలంటే మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. వీరు వివిధ రకాల రవాణా సంబంధిత సమస్యలను పరిష్కరిస్తారు. అంటే ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం, నగరాలను బైక్ యాక్సెసిబుల్‌గా మార్చడం వీరి విధి.

# శ్రీతేజ్‌ను పరామర్శించాలని సినీ ప్రముఖులకు ఉన్నప్పటికీ పరిధిలు ఉంటాయి

- కొన్ని పరిధుల వల్లనే పరామర్శించలేకపోతున్నారని వెల్లడి
- శ్రీతేజ్‌ను పరామర్శించిన జానీ మాస్టర్
- జైలు నుంచి బయటకు వచ్చాక కుటుంబానికే సమయం కేటాయిస్తున్నట్లు వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:**సినీ పరిశ్రమకు చెందిన చాలామందికి శ్రీతేజ్‌ను పరామర్శించాలని ఉంటుందని, కానీ కొన్ని పరిధులు ఉంటాయని ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అన్నారు. అలాంటి పరిధుల వల్ల వారు వచ్చి పరామర్శించలేకపోవచ్చునన్నారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట సందర్భంగా తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను, అతని కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... డ్యాన్సర్ యూనియన్ తరఫున శ్రీతేజ్‌కు సాయం అందిస్తామన్నారు. శ్రీతేజ్ ఆరోగ్యం మెరుగవుతుందని, అతను త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నానన్నారు. అతని కుటుంబానికి అండగా ఉంటామని, ఈ మేరకు కుటుంబ సభ్యులకు కూడా ధైర్యం చెప్పామన్నారు. ఈ సంఘటన తర్వాత తాను అల్లు అర్జున్‌ను కలవలేదని, తాను జైలు నుంచి బయటకు వచ్చాక కుటుంబానికే ఎక్కువ సమయం కేటాయించాలని నిర్ణయించుకున్నానని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తనకు వచ్చే సాంగ్స్ రిహార్సల్స్ చేసుకుంటూ ఫ్యామిలీతో సమయం గడుపుతూ సంతోషంగా ఉన్నానన్నారు. ప్రస్తుతం తన కేసు కోర్టు పరిధిలో ఉన్నందున అందుకు సంబంధించిన అంశాలు మాట్లాడలేనన్నారు.



# క్రైస్తవ మతమార్పిడి మాఫియా కేంద్రాలుగా మారిన తెలంగాణా రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు

**హెచ్చి జాతీయ అధికార ప్రతినిధి**
**డా. రావినూతల శశిధర్**

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణా రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల కేంద్రంగా నడుస్తున్న క్రైస్తవ మతమార్పిడి మాఫియాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈరోజు టీజీ ఆర్జేసీ అ సెక్రెటరీ రమణ కుమార్ ను వీహెచ్పి జాతీయ అధికార ప్రతినిధి ఆతీ. రావినూతల శశిధర్ లిఖితపూర్వక ఫిర్యాదు చేసారు. హనుమకొండ జిల్లా పరిధిలోని హసన్ పర్తి కళాశాలలో ప్రిన్సిపల్ ఇందుమతి మతమార్పిడి మాఫియాను కొనసాగిస్తున్నారని, విద్యార్థినులను వేధింపులకు మరియు ప్రలోభాలకు గురిచేసి మతం మారుస్తుందని, బాలికల రెసిడెన్షియల్ కళాశాలలోకి బయటి నుండి క్రైస్తవ ఫాదర్ లను రప్పించి మతమార్పిడి జరిపిస్తున్నారని , 21 సంవత్సరాలుగా ఒకే దగ్గర తిష్ఠవేసిన ప్రిన్సిపల్ ఇందుమతి వ్యవస్థలన్నింటిని తనకు అనుకూలంగా మలచుకొని హసన్ పర్తి బాలికల రెసిడిన్షియల్ కళాశాలను చర్చిగా మార్చిందని, మతం మారడానికి ఇష్టపడని విద్యార్థినులపై జరుగుతున్న వేధింపులు బరించలేక అనేకమంది విద్యార్థినులు తమ చదువులు మధ్యలోనే వదులుకుంటున్నారని, ప్రిన్సిపల్ భౌతిక వేధింపుల కారణంగా విద్యార్థినులు తీవ్ర భయంలో ఉన్నారని కార్యదర్శి దృష్టికి తీసుకొని వెళ్ళడం జరిగింది, పై విషయాలకు సంబందించిన వీడియోలు మరియు ఫోటోల సాక్ష్యాలను సెక్రటరి కి సమర్పించడం జరిగింది.

# వాజ్ పాయి పాలనలోనే భారత్ అభివృద్ధి బాట



**హైదరాబాద్ పెన్ పవర్:**అవినీతి, అరాచకం, కుంభ కోణాల్లో మునిగిపోయిన కాంగ్రెస్ పార్టీ అసమర్ధ పాలనకు చరమగీతం పాడి కొత్త అధ్యాయాన్ని లిఖించిన వాజ్ పాయి దార్శనికుడని భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రోగ్రాం కన్వీనర్ సోమారపు లావణ్య అన్నారు. బుధవారం వాజ్ పాయి జయంతిని పురకరించుకొని శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణి చేశారు. అనంతరం లావణ్య మాట్లాడుతూ, దేశం కోసం చివరి శ్వాసవరకు పరితపించిన వాజ్ పాయ్ జీవితం భారతీయులందరికి ఆదర్శప్రాయమని ఆయన ఆశయాలను భావితరాలకు అందించేందుకు ప్రతీ కార్యకర్త పాటుపడాలని పిలుపునిచ్చారు. ఆయన హయంలోనే గ్రామాలలో రోడ్లు, రైతులకు సంక్షేమ ఫలాలు, వందశాతం విద్యా, తదితర రంగాల్లో విప్లవాత్మకమైన సంస్కరణలు చేసిన ఘనత దక్కుతుందన్నారు. అణ్వస్త్ర ప్రయోగం జరిపి శత్రు దేశాల వెన్నులో వణుకు పుట్టించిన తొలి ప్రధానిగా చరిత్ర సృష్టించారని కొనియాడారు. తన పదవికాలంలో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకొని సమర్ధ ప్రధానిగా దేశానికి ఎనలేని సేవలు చేసిన వాజ్ పాయికి భారతరత్న ప్రకటించడం గర్వించదగ్గ విషయమని లావణ్య గుర్తు చేశారు. అంతకుముందు పెద్దపల్లి జిల్లాకు చెందిన సీనియర్ బిజెపి నాయకులు నారాయణదాసు సురేష్ కుమారును లావణ్య సన్మానించారు. జిల్లా కార్యాలయంలో వాజిపాయి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ వేడుకల్లో బిజెపి నాయకులు శిలారపు పర్వతాలు, కాసిపేట శివాజి, కావేటి రాజగోపాలి, దాడి సంతోష్, తంగెడ రాజేశ్వరరావు, పెద్దపల్లి రవీందర్, పోల్సాని సంపత్ రావు, సోడా బాబు, ఒల్లె తిరుపతి, మేకల శ్రీనివాస్, ఉప్పు కిరణ్ కుమార్, ఎర్రోళ్ళ శ్రీకాంత్, గుడ్ల సతీష్, ముంజ రాజేంద్ర ప్రసాద్, వేల్పుల రమేష్, కందుల శ్రీనివాస్, గాదరి సతీష్, రేండ్ల వేణు, పూదరి హరీష్, తదితరులు పాల్గొన్నారు.

# సంధ్యా టాకీస్ ఘటన దురదృష్టకరం

**హైదరాబాద్ పెన్ పవర్:** సంధ్యా టాకీస్ లో జరిగిన ప్రమాదంపై సినీ పరిశ్రమ అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు స్పందించారు. ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరం. సినీ పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వానికి వారధిలా ఉంటూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తాను. ఇటీవల జరుగుతున్న పరిణామాలను చూస్తున్నాను. ఈ అంశానికి త్వరలోనే పులిస్టాప్ పెడదాం. సినీ పరిశ్రమ వాళ్ళతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రభుత్వ పెద్దలకు త్వరలో కలిసి సమన్వయం చేసి ఈ సమస్యను పరిష్కారం దిశగా తీసుకెళ్తాను. శ్రీ తేజ ఆరోగ్య పరిస్థితి మెరుగవుతుంది. కిమ్స్ ఆస్పత్రిలో మెరుగైన వైద్య చికిత్సను అందిస్తున్నారు. బాధిత కుటుంబానికి ఎఫ్ డీ సి తరపున ఉద్యోగాన్ని ఇస్తాము. సంధ్యా థియేటర్ వద్ద జరిగిన తొక్కేసిలాట ఘటన దురదృష్టకరమని అన్నారు

# భయం గొలిపేలా నిప్పులు చిమ్ముతూ.. అగ్నిపర్వతం





**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికాలోని హవాయ్ దీవుల్లో ఉన్న కిలౌవా అగ్నిపర్వతం... ఒక్కసారిగా బద్దలైంది. భారీ శబ్ధంతో లావా బాంబులు, విషవాయువులను ఎగజిమ్మింది. ఆ తర్వాత నుంచి భారీ స్థాయిలో లావా వెలువడుతోంది. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయం (మన కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయం)లో ఈ అగ్నిపర్వతం బద్దలవడం మొదలైందని అమెరికా జియాలజికల్ సర్వే (యూఎస్ జీఎస్) విభాగం ప్రకటించింది.

**వందల అడుగుల ఎత్తులో లావా విరజిమ్ముతూ...**

అగ్నిపర్వతం బద్దలైనప్పటి నుంచి భారీగా లావా వెలువడుతోంది. 265 అడుగుల ఎత్తున అంటే సుమారు 20 అంతస్తుల భవనం ఎంత ఎత్తుతో.. ఓ పెద్ద ఫౌంటెయిన్ లా లావాను విరజిమ్ముతోంది. దీనితో అమెరికా జియాలాజికల్ సర్వే విభాగం సమీపంలోని కొండపై కెమెరా అమర్చి యూట్యూబ్ లో లైవ్ వీడియో పెట్టింది. ఈ అగ్నిపర్వతం చుట్టుపక్కల ప్రాంతాల్లో జనావాసాలు లేకపోవడం వల్ల ప్రస్తుతానికి భారీ ప్రమాదమేమీ లేదని ప్రకటించింది.

## కజకిస్థాన్‌లో కుప్పకూలిన విమానం.. పెద్ద సంఖ్యలో మృతులు




**హైదరాబాద్ పెన్ పవర్:**కజకిస్థాన్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. 105 మంది ప్రయాణికులు, ఐదుగురు సిబ్బందితో వెళుతున్న 'అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్'కు చెందిన జే2-8243 విమానం అక్టౌ విమానాశ్రయానికి సమీపంలో కుప్పకూలింది. ఈ ఘటనలో పెద్ద సంఖ్యలో మరణాలు సంభవించినట్టు తెలుస్తోంది. ప్రాథమిక సమాచారం ప్రకారం కేవలం ఆరుగురు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారని కజకిస్తాన్ వైద్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

ప్రమాదానికి గురైన విమానం అజర్‌బైజాన్ రాజధాని బాకు నుంచి రష్యాలోని చెచ్న్యాలోని గ్రోజ్నీకి వెళ్లాల్సి ఉంది. అయితే, దట్టమైన పొగమంచు కారణంగా విమానాన్ని దారి మళ్లించినట్టుగా అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు అందాల్సి ఉంది. కాగా, కుప్పకూలిన దృశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

## కొనసాగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

**కూకట్ పల్లి పెన్ పవర్::** తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తుంది. గత నెల రోజులుగా హైదరాబాద్ నగరంలో ముఖ్యంగా కూకట్పల్లి నియోజకవర్గంలో అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు జరిగింది ఈ ప్రక్రియ త్వరలో ముగియనున్న సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకురాలు నందమూరి సుహాసిని బుధవారం లింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని హైదర్ నగర్ లోను, కూకట్పల్లి హౌసింగ్ బోర్డ్ రమ్య గ్రౌండ్ వద్ద జరుగుతున్న నమోదు ప్రక్రియను పరిశీలించారు. పార్టీ సభ్యత్వ నమోదు మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులను సుహాసిని ఆదేశించారు సభ్యత్వం తీసుకోవడం ద్వారా కార్యకర్తకు జరిగే ప్రయోజనాలను వారికి తెలియజేయాలన్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదు పట్ల ప్రజల్లో మంచి స్పందన ఉందని స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు.

## భారీ వర్షాల పాలయిన ధాన్యం నిలువునా మునిగిన రైతులు

**వరంగల్ పెన్ పవర్::** ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలుచోట్ల వర్షం కురుస్తోంది. వర్షానికి చాలాచోట్ల వరి ధాన్యం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ లోకి అమ్మకంకోసం తీసుకొచ్చిన ధాన్యం తడిసిపోయింది. మరికొన్ని చోట్ల కల్లాల్లోనే ధాన్యం తడిసిపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జనగామ జిల్లాలోని జనగామ, స్టేషన్ ఘనపూర్, వేలేరు, ధర్మసాగర్ మండలాల్లో వర్షం కురిసింది. వరంగల్, హనుమకొండ జిల్లాలో చిరుజల్లులు కురిశాయి. మహబూబాబాద్ జిల్లాలోని డోర్నకల్ నియోజకవర్గంలో డోర్నకల్, నర్సింహులపేట, మరిపెడ, చిన్నగూడురు మండలాల్లో వాన పడింది. అటు గంగారం, కొత్తగూడ ఏజెన్సీలోనూ వర్షం కురిసింది. ములుగు జిల్లా ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, కన్నాయిగూడెం, వెంకటాపురం మండలాల్లో కురిసిన వర్షాలకు అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వరి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు పాట్లు పడుతున్నారు.

## పలు చర్చుల్లో క్రిస్మస్ వేడుకలు

**సికింద్రాబాద్ పెన్ పవర్::** సికింద్రాబాద్ లోని పలు చర్చి ల్లో క్రిస్మస్ సంబరాలు అంబరాన్ని అంటాయి.. క్రిస్మస్ పురస్కరించుకొని క్రిస్టియాన్ లు అంతా చర్చిలో ప్రత్యేక ప్రార్థన లో పాల్గొన్నారు.. ప్రత్యేక విద్యుత్ కాంతుల మధ్య చర్చిలు దగదగలాడాయి.. చర్చి పాస్టర్ల సారథ్యంలో ప్రార్థన గీతాలు ఆలపించి పూజలు నిర్వహించారు.. సెయింట్ మేరీస్ చర్చిలో జరిగిన వేడుకల్లో పలువురు ప్రముఖులు పాల్గొని ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. చర్చి లు అన్ని మత భోదకులు, భక్తుల మధ్య సందడి గా మారాయి

## ఘనంగా మహా యాగం కార్యక్రమం

**రంగారెడ్డి పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం లోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్ లో ఘనంగా జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహా యాగం కార్యక్రమంలో పలువురు ఆధ్యాత్మిక గురువులు పాల్గొని అద్భుతమైన సందేశాలు ఇస్తున్నారు. పత్రీజీ ధ్యాన మహా యాగం లో డిసెంబర్ 25న జరిగిన కార్యక్రమలో స్వామి నారాయణ అర్గనైజేషన్ కు చెందిన ప్రముఖ గురువు జ్ఞాన వత్సల స్వామిజీ పాల్గొని అద్భుతమైన సందేశాన్ని ఇచ్చారు. ధ్యాన మార్గంలో ప్రయాణిస్తున్న వారందరూ మంచి జ్ఞానాన్ని పొందాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. తమ స్వామి నారాయణ సంప్రదాయంలో కూడా ధ్యానం గొప్పతనం గురించి చెప్పడం జరుగుతుందన్నారు. పత్రీజీ ధ్యాన యాగంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ధ్యాన సాధనతో ముఖవర్చస్సుతో పాటు ఆత్మ కూడా ప్రకాశిస్తుందని తెలియజేసారు, ఈకార్యక్రమంలో పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి , ట్రస్ట్ మెంబర్ దామోదర మహాస్వామితో పాటు పలువురు పాల్గొన్నారు.

# రేషన్ కార్డు కొత్త రూల్.. దేశ వ్యాప్తంగా రేషన్ కార్డు ఉన్న వారికీ 5 కొత్త రూల్స్

**హైదరాబాద్ పెన్ పవర్:** మన ప్రభుత్వం రేషన్ కార్డ్ కొత్త నిబంధనలను ప్రవేశపెట్టింది మరియు రేషన్ కార్డు దారులందరూ వాటిని పాటించడం తప్పనిసరి. ఈ నియమాలు జనవరి 1, 2025 నుండి అమలు చేయబడతాయి. మీరు రేషన్ కార్డ్ హోల్డర్ అయితే, మీరు కొత్త నిబంధనల గురించి తెలుసుకోవడం ముఖ్యం.




అదనంగా, ప్రభుత్వం రేషన్ పంపిణీ వ్యవస్థ కోసం కొత్త నిబంధనలను ఏర్పాటు చేసింది. రేషన్ కార్డుదారులు ఇ-కెవైసి ని పూర్తి చేయడం ఇప్పుడు తప్పనిసరి. సకాలంలో ఈ కేవైసీ పూర్తి చేయని వారి పేర్లు రేషన్ కార్డు జాబితా నుండి తొలగించ బడతాయి.

**రేషన్ కార్డ్ కొత్త రూల్స్ 2025,**

మీరు ప్రభుత్వ దుకాణాల నుండి సబ్సిడీ సరుకులను స్వీకరిస్తే, రేషన్ కార్డు కొత్త నిబంధనల గురించి తెలుసుకోవడం ముఖ్యం. జనవరి 1, 2025 నుండి, ప్రభుత్వం రేషన్ కార్డ్ స్కీం కింద, కొత్త రూల్స్ లను అమలు చేస్తుంది. రేషన్ పంపిణీ వ్యవస్థను పూర్తిగా పారదర్శకంగా చేయడమే ఈ నిబంధనల ప్రధాన లక్ష్యం.

కొత్త నిబంధనల ప్రకారం, ఏ పౌరుడు రేషన్ కార్డు పథకాన్ని దుర్వినియోగం చేయలేరు. అవసరమైన వారికి మాత్రమే ప్రభుత్వ సహకారం అందుతుంది. దీన్ని నిర్ధారించడానికి, ప్రభుత్వం రేషన్ కార్డు దారులందరికీ ని ఇ-కేవైసీ తప్పనిసరి చేసింది.

**రేషన్ కార్డ్ కొత్త రూల్స్ ఇ- కేవైసీ,**

కొత్త నిబంధనల ప్రకారం, మీరు ఇకపై మునుపటి మాదిరిగానే రేషన్ అందుకోలేరు. ఇప్పుడు, మీరు మరింత సమతుల్య మరియు పోషకమైన ఆహారాన్ని అందుకుంటారు. ఉదాహరణకు, మీరు ఇంతకు ముందు 3 కిలోల బియ్యం మరియు 2 కిలోల గోధుమలు పొందేవారు, కానీ ఇప్పుడు పరిమాణం సవరించ బడింది.

కొత్త నిబంధనల ప్రకారం, మీరు ఇప్పుడు 2.5 కిలోల బియ్యం మరియు 2.5 కిలోల గోధుమలను అందుకుంటారు. అదనంగా, ఇప్పుడు రేషన్ కార్డు దారులందరికీ ఇ-కెవైసి తప్పనిసరి చేయబడింది. మీరు మీ ఇ-కేవైసీ ని గడువులోగా పూర్తి చేయాలి, అంటే డిసెంబర్ 31, 2024.

ఈ వ్యవధిలో మీరు మీ ఇ- కేవైసీ పూర్తి చేయకుంటే, మీరు రేషన్ కార్డ్ పథకం ప్రయోజనాలను కోల్పోవచ్చు. దీని వల్ల ప్రయోజనాలు నిజంగా అర్హులైన వారికి మాత్రమే అందుతాయి. రేషన్ కార్డ్ కొత్త రూల్స్ 2025 ప్రకారం ఇ- కేవైసీ తప్పనిసరి,

చెప్పినట్లుగా, కొత్త రేషన్ కార్డ్ నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఇ-కెవైసి ని తప్పనిసరి చేసింది. ఈ నిర్ణయం వెనుక ప్రధాన కారణాలు:

ఇ- కేవైసీ ప్రక్రియ ద్వారా నకిలీ రేషన్ కార్డులు రద్దు చేయబడతాయి.

లబ్ధిదారుల పౌరులకు సంబంధించిన ఖచ్చితమైన డేటా ప్రభుత్వం వద్ద ఉంటుంది.

నిజంగా అవసరమైన వ్యక్తులు మాత్రమే పథకం ద్వారా ప్రయోజనాలను పొందుతారు.

ఈ ప్రక్రియ దేశంలో మరింత డిజిటలైజేషన్ ను ప్రోత్సహిస్తుంది.

రేషన్ కార్డు కొత్త నిబంధనలను పాటించక పోవడం వల్ల కలిగే పరిణామాలు:

మీరు రేషన్ కార్డుల కోసం కొత్త తప్పనిసరి నిబంధనలను పాటించకపోతే, ప్రభుత్వం మీ పేరును జాబితా నుండి తొలగించవచ్చు. అటువంటి సందర్భంలో, మీరు ఇక పై సబ్సిడీ రేషన్ అందుకోలేరు. అంతేకాకుండా, చెల్లుబాటు అయ్యే రేషన్ కార్డు లేకుండా, మీరు ఇతర ప్రభుత్వ పథకాల నుండి ప్రయోజనం పొందలేరు. అటువంటి సమస్యలను నివారించడానికి, మీ ఇ-కేవైసీ ని సకాలంలో పూర్తి చేయడం ముఖ్యం, కాబట్టి మీరు రేషన్ కార్డ్ స్కీమ్ పొందడం కొనసాగించవచ్చు.

2024లో రేషన్ కార్డ్ కోసం ఇ-కెవైసి ని ఎలా పూర్తి చేయాలి.

మీ రాష్ట్ర ప్రభుత్వ అధికారిక రేషన్ కార్డ్ లేదా ప్రజా పంపిణీ వ్యవస్థ పిడిఎస్, పోర్టల్‌ని సందర్శించండి. మీ నమోదిత ఆధారాలను ఉపయోగించి లాగిన్ చేయండి లేదా మీ మొబైల్ నంబర్ మరియు ఇమెయిల్ ఐడి, వంటి ప్రాథమిక వివరాలను అందించడం ద్వారా ఖాతాను సృష్టించండి.

సాధారణంగా హోమ్ పేజీలో రేషన్ కార్డ్ సర్వీస్ లేదా, నవీకరణ వివరాలు విభాగంలో కనిపించే ఇ- కేవైసీ విభాగానికి నావిగేట్ చేయండి.

కుటుంబ పెద్ద లేదా రేషన్ కార్డ్ హోల్డర్‌కి లింక్ చేసిన ఆధార్ నంబర్‌ను ఇన్‌పుట్ చేయండి. ఆధార్‌తో లింక్ చేయబడిన మొబైల్ నంబర్ యాక్టివ్‌గా ఉందని నిర్ధారించుకోండి.

రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు వన్-టైమ్ పాస్‌వర్డ్ ఓటిపి, పంపబడుతుంది. మీ ఆధార్‌ని ధృవీకరించడానికి పోర్టల్‌లో ఓటిపి నమోదు చేయండి.

విజయవంతమైన ధృవీకరణ తర్వాత, మీ ఇ-కేవైసీ నవీకరించబడుతుంది. భవిష్యత్తు సూచన కోసం రసీదుని సేవ్ చేయండి లేదా స్క్రీన్‌షాట్ తీసుకోండి.

# అబద్దాల్లో కాంగ్రెస్ కు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చు

**హైదరాబాద్ పెన్ పవర్:** 1954 నుండి 88 వరకు నెహ్రూ ఇందిరసహా 21 మందికి భారత రత్న ఇచ్చారుకానీ బాబాసాహెబ్ ను ఎందుకు విస్మరించిందో కాంగ్రెస్ చెప్పాలి. అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తున్న పార్టీ బీజేపీదేశ ప్రజల స్ఫూర్తి ప్రదాత వాజ్ పేయి. సిద్ధాంతానికి, నైతిక విలువలకు కట్టుబడి ప్రధాని పదవినే త్యజించిన మహనీయుడు..వాజ్ పేయి ఆశయాలను తూ.చ తప్పకుండా అమలు చేస్తున్న మోదీ ప్రభుత్వం. కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు:వాజ్ పేయి జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించిన కేంద్ర మంత్రికిషన్ రెడ్డి, లక్ష్మణ్ లతో కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన సంజయ్.

రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ ను అడుగడుగునా అవమానించిన పార్టీ కాంగ్రెస్, నేడు ఆయన పై మొసలి కన్నీరు కార్చడం విడ్డూరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. అబద్దాలను ప్రచారం చేయడంలో కాంగ్రెస్ గోబెల్స్ ను మించి పోయిందని, అబద్దాల్లో ఆస్కార్ అవార్డు ఇవ్వాల్సి వస్తే.. అది కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. అంబేద్కర్ గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ హయాంలో భారతరత్న అవార్డు అంబేద్కర్ కు ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలన్నారు. పార్టీ 1954 నుండి 1988 వరకు నెహ్రూ, ఇందిరా, కామరాజ్ సహా 21 మందికి భారతరత్న అవార్డును ప్రకటించారు. కానీ రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ కు మాత్రం ఇవ్వలేదు. ఆయన ఎందులో తక్కువ. ఆయన చేసిన తప్పేంది? అని ప్రశ్నించారు. వాజ్ పేయి జయంతి సందర్భంగా హైదరాబాద్ లోని నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్ తదితరులతో కలిసి మాజీ ప్రధాని వాజ్ పేయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారితో కలిసి బీజేవైఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ఏమన్నారంటే. మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్ పేయి జయంతి సందర్భంగా ఘనంగా కార్యక్రమాలు నిర్వహించుకోవడం సంతోషం. భారతదేశ వైభవాన్ని, నైతిక విలువలను ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పిన నేత వాజ్ పేయి. దేశ ప్రజలకు స్ఫూర్తి ప్రదాత వాజ్ పేయి. ప్రోక్రాన్ అణుపరీక్షలు, స్వర్ణ చతుర్భుజీ, గ్రామీణ సడక్ యోజన వారి చలువే. పార్లమెంట్ లో బలనిరూపణ విషయంలో అనేక మంది ఇతర పార్టీలో ప్రభుత్వానికి మద్దతిచ్చేందుకు సిద్ధంగా ఉన్నా, నీతి, నిజాయితీగా వ్యవహరించి పదవిని కోల్పోయిన మహనీయుడు వాజ్ పేయి.